

5న మెగా పీటీఎం

తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలి

కలెక్టర్ రాజకుమారి



నంద్యాల, నూనెపల్లి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం ఆమె తమ చాంబర్ నుంచి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో మెగా పీటీఎం ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో విద్యార్థుల అకడమిక్ ప్రదర్శన, చదువులో ఎలా ఉన్నారు?, ఇతర కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటున్నారు?, అభివృద్ధి ఎలా ఉంది? అనే విషయాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడతారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు హెచ్‌పీసీ (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు)ను అందజేస్తారన్నారు. మధ్యాహ్నం తల్లిదండ్రులకు కూడా భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు, పరీక్ష ఫలితాలు, దిన చర్య పురోగతి తదితర వివరాలను తెలుసుకోవడానికి లీప్ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఎఫ్ఎల్ఎన్ పరిధిలో విద్యార్థులు చదువుతున్న తరగతికి తగ్గ పఠన-లేఖన నైపుణ్యాలు ఉన్నాయా? లేదా? అన్న విషయంపై కూడా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చిస్తారన్నారు. పదో తరగతి వచ్చేనెల 5వ తేదీకి పూర్తి కాబోతోందని, అప్పటి నుంచి వందరోజుల కార్యాచరణ ద్వారా వారికి పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాన్ని సమీక్షించనున్నట్లు తెలిపారు.

జిల్లాలోనే ఆదర్శం

మద్దూరు పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలం మద్దూరు పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దబోదనం, మద్దూరు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సామర్థ్యాలు, అపార్ ఐడీల జనరేషన్, కిచెన్‌గార్డెన్ వంటి అంశాలను పరిశీలించారు. మద్దూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి కలిసి రూ.1.85 లక్షల వ్యయంతో తరగతి గదుల్లో గ్రానైట్ ఏర్పాటు చేసినందుకు, విద్యార్థులకు ఐడెంటీ కార్డులు అందించినందుకు డీఈవో వారిని అభినందించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ జిల్లాలో 210 మోడల్ స్కూళ్లు, 107 కాంప్లెక్సులు ఉన్నాయని అన్నారు. ఈ ఏడాది కొత్తగా 648 మంది ఉపాధ్యాయులను నియమించామని అన్నారు. పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాల ద్వారా 91 శాతం పూర్తి చేశామని అన్నారు. జిల్లాలో 107 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లకు నిధులు మంజూరు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి హత్య

- చంపి మద్దూరు వద్ద కుందూలో పడేశారు
- ఆలస్యంగా వెలుగులోకి..
- డబ్బు కోసమే జరిగి ఉండొచ్చని అనుమానం

5



ఈసారైనా లెక్క తేలేనా..?

- నల్లమలలో పెద్ద పులుల సంఖ్య తగ్గిందని అనుమానం
- సంరక్షణ సరిగా లేనందునే ఆ అధికారి బదిలీ..?
- పెద్దపులుల సంరక్షణ ఎన్‌టీసీఏ ఆధ్వర్యంలో..
- 1 నుంచి పులుల గణన ప్రారంభం

జీవ వైవిధ్యానికి నెలవైన నల్లమల పెద్ద పులుల ఆవాసం. అయితే ఈ అడవిలో ఎన్ని పులులు ఉన్నదీ స్పష్టంగా తెలియడం లేదు. పైగా పెద్దపులుల సంఖ్య తగ్గినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ఎస్‌టీఆర్ నిర్వహణ సరిగ్గా లేనందున ఇటీవల ఓ అధికారిని ఫారెస్టుశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు బదిలీ చేశారు. డిసెంబరు 1 నుంచి పులుల లెక్కింపు ప్రారంభం కానుంది.

రుద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు తలమానికం. అతి పెద్ద పులుల అభయారణ్యం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 3728 చదరపు కిలోమీటర్లు నంద్యాల ఉమ్మడి ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో విస్తరించి ఉంది. కృష్ణానది నల్లమలలో 270 కిమీ ప్రవహిస్తోంది. వన్యప్రాణులకు కృష్ణానదే ప్రధాన నీటి వనరు. నల్లమలలో పెద్దపులులతో పాటు చిరుత పులులు, తోడేళ్లు, అడవి కుక్కలు, నక్కలు, జింకలు, మచ్చ జింకలు, నెమళ్లు ఉన్నాయి.

పెద్దపులుల గణాంకాలిలా

నల్లమల అడవిలో ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో పెద్ద పులుల గణాంకాలు ప్రతి ఏడాది ఇలా ఉన్నాయి. శాస్త్రీయంగా గణాంకాలు చేస్తారు. 2018లో ప్రారంభించారు. 2025లో 84, 2024లో 76, 2023లో 74, 2022లో 73, 2021లో 73, 2020లో 73, 2019లో 63, 2018లో 47 పెద్ద పులులు ఉన్నట్లుగా గుర్తించారు.

నల్లమలలో తగ్గిన పెద్ద పులుల సంఖ్య..?

నల్లమల అడవుల్లో పెద్దపులుల సంఖ్య తగ్గిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..? ఎన్ఎస్‌టీఆర్ రిజర్వులో నెంబర్లు ఇచ్చిన పెద్దపులులే కనిపించడంలేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.? ఎన్ఎస్‌టీఆర్ నుంచి వేరే ప్రాంతానికి, అడవులకు తరలి వెళ్లాయా..? వృద్ధాప్యం వల్ల చనిపోయాయా..? వేటగాళ్ల బారిన పడి మృతి చెందాయా..? ఉచ్చుల బారిన పడి మృతి చెందాయా..? సరిపడా ఆహారం లేక మరో ప్రాంతానికి తరలి వెళ్లిపోయాయా..? ఏదిఏమైనా నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వులో నెంబర్లు ఇచ్చిన పెద్దపులులు కనిపించడం లేదని, మరో ప్రాంతానికి వెళ్లపోయాయని సిబ్బంది మాట్లాడుకుంటున్నారు. ఈసారైనా పెద్దపులుల సంఖ్య తేలేనా..?

ఎన్‌టీసీఏ ఆధ్వర్యంలో పెద్దపులుల సంరక్షణ

నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో పెద్దపులుల సంరక్షణ కొనసాగుతోంది. ఎన్‌టీసీఏ ప్రతి అంశాన్ని పెద్దపులుల సంరక్షణ పరిధిలో పరిశీలిస్తుంది. దేశంలోని ప్రతి పులుల అభయారణ్యాన్ని ఎన్‌టీసీఏ పరిధిలోకి వస్తాయి.

మూడు జిల్లాలు, 25 రేంజ్‌లు

ఎన్ఎస్‌టీఆర్ పరిధిలో నంద్యాల, ఉమ్మడి ప్రకాశం, పల్నాడు జిల్లాలు విస్తరించి ఉన్నాయి. 25 రేంజ్‌లు, 250 బీట్‌లు, వందల సంఖ్యలో లోకేషన్లు ఉన్నాయి.

సంరక్షణ సరిగా లేనందునే ఆ అధికారి బదిలీ..?

నాగార్జున, శ్రీశైలం టైగర్ రిజర్వులో పనిచేసిన ఆ అధికారి సంరక్షణ, విధులు నిర్వహణ సరిగ్గా లేదంటూ రాష్ట్ర ఫారెస్టుశాఖ ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దేశానికి తలమానికంగా నల్లమల అడవులు. అభయారణ్యంలో పెద్దపులుల సంరక్షణ సరిగ్గా లేనందునే ఆ అధికారిని బదిలీ చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ? ఈ అంశాలు కొత్తగా వచ్చిన అధికారికి సవాళ్లు కానున్నాయి.

కొత్తగా స్పాట్‌టెన్ కెమెరాలతో..

ఈసారి నల్లమల అడవిలో పెద్దపులుల గణాంకాలు (సర్వే) కొత్త టెక్నాలజీతో స్పాట్ టెన్ కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. ఈ కెమెరా ట్రాప్‌లు పెద్దగా వెలుతురు లేకుండా వన్యప్రాణులను రికార్డు చేస్తాయి. రికార్డు చేసిన పెద్దపులుల చిత్రాలను బయోడైవర్సిటీ ల్యాబ్‌లో చర్మంపై ఉండే చారల ఆధారంగా లెక్కిస్తారు. పెద్దపులికి మనిషికి ఉన్నట్లు వేలి ముద్రలు ఉండవు. కంప్యూటర్ల ద్వారా విశ్లేషిస్తారు. అలా విశ్లేషించి వైల్డ్ ఐడీ సాఫ్ట్‌వేర్‌లో, క్యాప్చర్, రీక్యాప్చర్ సాఫ్ట్‌వేర్ విధానంలో లెక్కిస్తారు.

పులుల సంఖ్య తగ్గింది, పెరిగింది తెలుస్తుంది



పెద్దపులుల గణాంకాల సర్వే నాలుగేళ్లకొకసారి జరుగుతంది. డిసెంబరు 1 నుంచి 8వతేదీ వరకు ఫేజ్-1, డిసెంబరు 15నుంచి 2026 మే 31 వరకు ఫేజ్-3 గణాంకాలు జరుగుతాయి. పెద్దపులుల సంఖ్య తగ్గిందా లేక పెరిగిందా అనేది తెలుస్తుంది.

- విజయకుమార్, ఫీల్డ్ డైరెక్టరు, ప్రాజెక్టు టైగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం



ఆయిల్ పామ్‌తో లాభాలు

- 100 శాతం రాయితీ
- 500 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు
- రైతులకు ప్రోత్సాహం కల్పిస్తున్న ఉద్యానశాఖ

4

రెవెన్యూ డివిజన్‌గా బనగానపల్లె

- ఐదు మండలాలతో కలిపి ఏర్పాటు
- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ
- 30 రోజుల్లో అభ్యంతరాలు
- ఆనందంలో ఆయా మండలాల ప్రజలు



నంద్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. గురువారం ప్రభుత్వ స్పెషల్ సెక్రెటరీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఐదు మండలాలతో(బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల) కలిపి కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో నేటి నుంచి 30 రోజుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత కలెక్టర్ రాజకుమారి వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, డోన్ రెవెన్యూ డివిజన్‌లు ఉండగా.. కొత్తగా బనగానపల్లె డివిజన్‌తో మొత్తంగా జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్‌లు కానున్నాయి. ఏది ఏమైనా కొత్త రెవెన్యూ డివిజన్ ప్రకటనతో ఆ ఐదు మండలాల ప్రజల్లో ఆనందోత్సవం మొదలైంది.

17 గ్రామాలతో పెద్దహరివాణం మండలం

- ఆదోని నుంచి విభజన
- కర్నూలు జిల్లాలో 27కి చేరిన మండలాలు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం



కర్నూలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటు కోసం గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఆదోని మండలం విభజించి.. కొత్తగా 17 గ్రామాలతో పెద్ద హరివాణం మండలం ఏర్పాటుకు గెజిట్ విడుదల చేశారు. కొత్త మండలం ఏర్పాటుపై అభ్యంతరాలకు నెల రోజుల్లోగా తెలియజేయాలని అందులో పేర్కొన్నారు. ఆదోని జిల్లా చేయాలని ఇక్కడి ప్రజలకు బలంగా సెంటిమెంటు ఉంది. అదే క్రమంలో 46 గ్రామాలతో అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోనిని మూడు మండలాలుగా విభజించాలని ప్రజలు డిమాండ్ చేశారు. 65 ఏళ్ల కల ఆదోని జిల్లా సాకారం చేయాలంటూ రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. అయితే జిల్లా విషయమే మంత్రివర్గ ఉపసంఘం పట్టించుకోలేదు. ఆ ప్రతిపాదనే తీసుకురాలేదు. అంతేగాకుండా ఆదోని, ఆదోని అర్బన్, పెద్దహరివాణం, పెద్ద తుంబళం నాలుగు మండలాలుగా విభజించాలని ప్రజలు, రాజకీయ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా పెద్దహరివాణం కేంద్రంగా 17 గ్రామాలతో కొత్త మండలం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం కొసమెరుపు. ఇక ఆదోని మండలంలో 29 గ్రామాలు మిగులుతున్నాయి. జిల్లాలో అతిపెద్ద మండలంగా ఉన్న ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విడిపోవడంతో జిల్లాలో మండలాల సంఖ్య 26 నుంచి 27కు చేరనుంది.

బోగస్ 60 వేలు

- ఉపాధి హామీలో అక్రమ జాబ్‌కార్డులు
- గత వైసీపీ పాలనలో అక్రమం
- బోగస్ జాబ్‌కార్డులతో నిధులు స్వాహా
- కూటమి పాలనలో ఏరివేత



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఉపాధి హామీ పథకం ఆ పార్టీ నాయకులు, అనుచరుల జేబు నింపింది. కూటమి ప్రభుత్వం ఆధార్, ఈకేవైసీ తదితర కార్యక్రమాల ద్వారా బోగస్ జాబ్ కార్డుల ఏరివేత కార్యక్రమంలో ఇదంతా బయటపడింది. కర్నూలు జిల్లాలో 44,444 జాబ్‌కార్డులు బోగస్ అని తేలింది. నంద్యాల జిల్లాలో 17,663 బోగస్ జాబ్‌కార్డులను తొలగించారు. తమ అధికార బలంతో బోగస్ పేర్లు రికార్డుల్లో నమోదు చేయించి రూ.కోట్లల్లో నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 60వేల జాబ్‌కార్డుల తొలగింపు

కర్నూలు జిల్లాలో గత వైసీపీ పాలనలో 2,98,276 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. వారందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 2,50,117 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. ఇవన్నీ ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న గ్రామాల్లోని నాయకులు బోగస్ జాబ్‌కార్డులని తేలింది. వీటి ద్వారా వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నట్లు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన ఏరివేత కార్యక్రమంలో వెలుగులోకి వచ్చింది. ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న ఈ అక్రమాలను సరి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 నుంచి ఎప్పటికప్పుడు సరికొత్త విధానాలను అమలు చేశాయి. పని చేసే కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో బోగస్ కూలీల చిట్టా బయటపడుతోంది. కర్నూలు జిల్లాలో 44,444 జాబ్‌కార్డులు బోగస్ అని తేలింది. నంద్యాల జిల్లాలో 17,663 బోగస్ జాబ్‌కార్డులను తొలగించారు. మృతులు, గ్రామాలు వీడిన వారు ఇతరత్రా 60వేల మంది ఉమ్మడి జిల్లాలో ఆచూకీ లేకపోవడంతో వారి కార్డులను రద్దు చేశారు. మరో 30 వేల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల్లో పెద్ద ఎత్తున వైసీపీ నాయకుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో బోగస్ కూలీల పేరుతో నిధుల స్వాహా చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు చేపట్టిన చర్యలతో బట్టబయలైంది.

బోగస్ కార్డుల ఏరివేత చేపట్టాం



కర్నూలు జిల్లాలో 2,98,276 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చాం. . దాదాపు 5,56,672 మంది కూలీలు ఈ పథకం ద్వారా వంద రోజులు పనులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బోగస్ కూలీలను ఏరివేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్ కార్డు, ఈకేవైసీ ద్వారా బోగస్ కూలీల పేర్లు ఏరివేశాం. ఈకేవైసీ చేయించుకోని కూలీల జాబ్‌కార్డులు తొలగిస్తున్నాము. వాస్తవంగా గ్రామంలోనే ఉండి ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలి. లేకపోతే వాటి జాబ్‌కార్డులను తొలగిస్తాం.

- వెంకటనారాయణ, డ్వామా పీడీ

ఆయిల్ పామ్‌తో లాభాలు

- 100 శాతం రాయితీ
- 500 హెక్టార్లలో ప్లాంటేషన్ ఏర్పాటు
- రైతులకు ప్రోత్సాహం కల్పిస్తున్న ఉద్యానశాఖ



చాగలమర్రిలో సాగు చేసిన ఆయిల్ ఫామ్ మొక్కలు

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను అందిస్తోంది. మొక్కల కొనుగోలు, ఎరువులు, అంతర్ పంటల సాగుతో పాటు మార్కెట్ సదుపాయం వరకు సౌకర్యాలు కల్పిస్తోంది. కూటమి ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రాయితీపై మొక్కలు వంద శాతం రాయితీతో అందించడంతో జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో ఇప్పటికే 29 మండలాల్లో 1,200 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం ఉంది. 500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు అవుతోంది. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో చాగలమర్రి, రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, ఆళ్లగడ్డ మండలాల్లో 350 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు అవుతోంది. దీనికి సంబంధించి రైతు సేవా కేంద్రాల నుంచి దరఖాస్తులు కూడా తీసుకుంటున్నారు. ఒక్కో ఎకరాకు 57 మొక్కలు త్రికోణాకార పద్ధతిలో నాటుకోవాల్సి ఉంటుంది. ఈ మొక్కల సరఫరాకు సంబంధించి నవభారత్ లిమిటెడ్ కంపెనీ 3ఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ, పతంజలి ఆయిల్ ఫామ్, తుమ్మల ఆగ్రో ప్రాజెక్టు కంపెనీలకు ప్రభుత్వం కేటాయించింది.

ఆయిల్‌పామ్ సాగుకు 4 ఏళ్లకు రూ.62 వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్‌పామ్ సాగుకు రూ.71 వేలు రైతులకు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా యాంత్రీకరణ, నీటి వసతి పరికరాలకు రూ20 వేలు నుంచి రూ.1.50 లక్షల వరకు రాయితీ ఇస్తోంది. అయితే మొదటి మూడు సంవత్సరాలు ఆయిల్‌పామ్ మొక్కలు పెంచేందుకు సమయం పడుతుంది. భూసారం, మొక్క ఎదుగుదలను బట్టి 4వ సంవత్సరం నుంచి ఫలసాయం చేతికందే అవకాశం ఉంది. ఆయిల్‌పామ్ సాగు చేసుకునే రైతులకు హెక్టారుకు ఇచ్చే రూ.5,250 నగదుకు కూడా మూడేళ్ల పాటు రాయితీ లభిస్తుంది. జిల్లాలోని రైతులను ప్రతి ఏడాది విహార యాత్రల ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేసే ప్రాంతాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు కూడా రైతులను ఆయా కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి. ఆయిల్‌పామ్ తయారీ విధానంపై కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

మార్కెట్ సదుపాయం కూడా..

ఆయిల్‌పామ్ మొదటి కాపు ఎకరానికి దాదాపు 3 నుంచి 4 టన్నులు వచ్చే అవకాశం ఉంది. 8 ఏళ్ల వయసు ఉన్న తోటల్లో ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా రైతులకు మొక్కలు అందిస్తున్న సంస్థలే పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గతంలో టన్ను రూ.14 వేలు ఉన్న ఆయిల్‌పామ్ ధర ప్రస్తుతం రూ.17 వేలకు పైగా మార్కెట్‌లో రేటు పలుకుతోంది.



చింతలచెరువులో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

ఆయిల్‌పామ్ పంట సాగు వివరాలు

- మనదేశం, రాష్ట్రంలో వాతావరణం ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుంది.
- ఆయిల్‌ఫామ్ సాగుకు అన్ని నెలలు అనుకూలమైనవి.
- ఏడాది వయసున్న ఆరోగ్యకరమైన మొక్కలను చతురస్రాకార పద్ధతిలో ఎకరాకు 50 మొక్కలు చొప్పున నాటుకోవాలి.
- వాతావరణ పరిస్థితులనుబట్టి ఒక మొక్కకు రోజుకు 150-300 లీటర్ల నీరు అందించాలి.
- సూక్ష్మ నీటి యాజమాన్యం అవలంబించడం ద్వారా నీటి వినియోగాన్ని పర్యవేక్షించవచ్చు.
- ఆయిల్‌పామ్ సాగుకు పశువుల ఎరువులు, జీవన ఎరువులు అతి ముఖ్యమైనవి.
- ఆయిల్‌పామ్ తోటలలో మొదటి 3 సంవత్సరాలు ఏక వార్షిక పంటలు, అంతర్ పంటలుగా పండించుకోవడానికి అనుకూలం.

4 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు

4 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశా. మూడు నెలల క్రితం మొక్కలు నాటా. 200 మొక్కలకు రూ.40 వేలు దాక ఖర్చు చేశా. మొక్కలకు కంపెనీ వారు బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో మొక్కలు కొనుగోలు చేసుకొని సాగు చేసుకుంటున్నా.

\- సుద్దపల్లె బాషా, రైతు, చాగలమర్రి

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. 6 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు మొక్కలు నాటి పెంచుతున్నా. నవభారత్ కంపెనీ వారు మొక్కలు కొనుగోలు చేసి ఉచితంగా అందజేశారు. మొక్కలు పచ్చగా ఏపుగా పెరిగాయి. మొక్కల మధ్య అంతర్ పంట సాగు చేసేందుకు వీలు ఉంది.

\- సాయిమోహన్‌రెడ్డి, రైతు, జ్ఞానాపురం

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు



ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం 100 శాతం రాయితీ ఇస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులకు ఈ సాగు ఎంతో లాభాయకం.

\- దస్తగిరి, ఉద్యానశాఖ అధికారి, ఆళ్లగడ్డ

ఆయిల్‌పామ్ సాగు వల్ల లాభాలు



ఆయిల్‌పామ్ నూనె తయారీ విధానంపై రైతులకు అవగాహన

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చును.
- తక్కువ కూలీలతో ఎక్కువ ఎకరాలు సాగు చేయవచ్చును.
- ఎటువంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులనైన పంట తట్టుకుంటుంది కాబట్టి నష్టం ఉండదు.
- ప్రతి ఎకరాకు 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- పండించిన మొత్తం పంటలను దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నేరుగా కంపెనీ వారికే అమ్ముకునే విధానం ఉంది.
- ప్రతి వారం నుంచి 10 రోజులకు ఒకసారి గెలల కోత, వచ్చే నగదును నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తారు.
- ఆయిల్‌పామ్ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే రూ.40 వేలు నుంచి రూ.49 వేలు హెక్టారుకు ప్రోత్సాహం.
- మొదటి 4 సంవత్సరాలు ఎరువుల కోసం నగదు బదిలీ పథకం ద్వారా రైతుకు అందిస్తారు.

యూపీపీఎస్‌సీ శిక్షణ దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు యూపీపీఎస్‌సీ సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు కర్నూలు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ పరీక్షలకు ఉచిత శిక్షణ కావాలనుకొనే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కర్నూలు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కార్యాలయంలో స్వయంగా వచ్చి తమ బయోడేటాతో పాటు రెండు ఫొటోలు, విద్యార్హత, కుల ఆదాయం, ఆధార్ కార్డు పాన్ కార్డు ధృవీకరణ జిరాక్సులను దరఖాస్తుకు జతపరిచి డిసెంబరు 3వ తేదీ సాయంత్రం 4గంటలోపు సమర్పించాలన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అందని సాయం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందించే ఎస్కార్ట్ అలవెన్స్ మంజూరు చేయలేదు. కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష శాఖ పరిధిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మొత్తం 460 మంది ఉన్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలల స్థాయిలో 293 మంది కాగా, సెకండరీ స్కూల్ స్థాయిలో 167 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి 10 నెలలకు గాను రూ.6వేలు ఆర్థిక సాయం తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తుంది. జూన్ నుంచి అక్టోబరు నెల వరకు సంబంధించి ఎస్కార్ట్ అలవెన్స్ కేవలం 170 మందికి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసింది. మరో 290 మందికి ఆర్థిక సాయం అందించకపోవడంతో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఆర్థిక సాయం మంజూరైన విషయంపట్ల ఐఆర్‌టీలలో స్పష్టత కరువైంది. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లాలో భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇచ్చే ఫిజియోథెరపిస్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 9 ఫిజియోథెరపిస్టు పోస్టులు అవసరం కాగా, ఇందులో ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. మిగతా నాలుగు పోస్టులు ఖాళీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫిజియోథెరపిస్టులకు ఇచ్చే గౌరవ వేతనం అంతంతంగా మాత్రంగా ఉండటంతో పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వీరికి నెలకు 14,380 గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇచ్చే గౌరవ వేతనం పెంచాలని ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- కరాటే విజేతలకు ఘన సన్మానం
- జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి సబిహా పర్వీన్



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి పర్వీన్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబిహా పర్వీన్ సూచించారు. ఇటీవలే హైదరాబాదులో కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ప్రెసిడెంటు కప్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా విద్యార్థులను గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రతిభ చాటుతూ దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ఇంటలెక్చువల్ కలెక్టివ్ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం. ఖదీరుల్లా మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లాకు చెందిన విద్యార్థులు మహ్మద్ జేద్ (వెండి మెడల్), ముదాసిర్ (కాంస్యం), ముజహీద్ (కాంస్యం), మహీర్ (కాంస్యం), మరియం (కాంస్యం)లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కర్నూలు జిల్లా చైర్మన్ ఫారూక్, ప్రెసిడెంటు ఖాజా, టీడీపీ నాయకుడు రజాక్ పాల్గొన్నారు.

బైపాస్ పనుల్లో వేగం పెరగాలి

- పనులపై మంత్రి బీసీ సమీక్ష



అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో నిర్మిస్తున్న బైపాస్ నిర్మాణ పనుల్లో వేగం పెరగాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో బనగానపల్లె బైపాస్ రహదారి నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ వివేకానందారెడ్డి, కర్నూలు ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్‌రెడ్డితో మంత్రి సమీక్ష నిర్వహించారు. బనగానపల్లె బైపాస్ నిర్మాణం పనులు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం 2 విడతలుగా రూ.5కోట్లు చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి బనగానపల్లె బైపాస్ నిర్మాణం పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు చొరవతీసుకొని పని చేయాలని కోరారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన రహదారుల రూపకల్పనకు గుంతల రహిత రోడ్లను తీర్చిదిద్దాలని మంత్రి బీసీ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను సాధ్యమైనంత వరకు పూర్తి చేయాలన్నారు.

స్పౌజ్ కోటాలో బదిలీ అవకాశం

- దంపతులకు ఒకే ప్రాంతంలో ఉద్యోగావకాశం
- ఈ నెలాఖరుకు ముగియనున్న సచివాలయ ఉద్యోగుల బదిలీలు



నంద్యాలలోని ఒక సచివాలయం

నంద్యాల టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భార్య ఒక చోట, భర్త మరో చోట ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తుండడంతో పిల్లల పోషణ, వృద్ధుల సంరక్షణ విషయాల్లో ఇబ్బంది పడుతున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్య పరిష్కారం కానుంది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు స్పౌజ్ కోటాలో అంతర్‌జిల్లా బదిలీలకు అనుమతి ఇచ్చింది. తద్వారా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో ఉద్యోగం చేసే అవకాశం వస్తుంది. ఈనెల 30కి బదిలీల ప్రక్రియ పూర్తి కానుంది.

జిల్లాలో వివరాలు ఇలా ఉన్నాయి

జిల్లాలో సచివాలయాలు: 516

సచివాలయం ఉద్యోగులు: 4,353

గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ 2019 సెప్టెంబర్‌లో ఆమల్లోకి వచ్చింది. 2022 జూలైలో ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఆదే ఏడాది చివర్లో స్పౌజ్ కోటాలో బదిలీలు చేపట్టారు. అప్పట్లో పరస్పర అంగీకారం మేరకు బదిలీలు నిర్వహించేవారు. దీంతో చాలా మంది ఉన్నచోటి నుంచి వేరే ప్రాంతానికి కదల్లేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ స్పౌజ్ కోటాలో బదిలీలకు అవకాశం కల్పించ లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి



ఈనెల చివరి వరకు సచివాలయం ఉద్యోగులు సౌజ్ కోటాలో బదిలీ పొందడానికి అవకాశం ఉంది. దీన్ని ఉపయోగించుకోవాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు చేయాలి.

\- బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

మహానందీశ్వరుడి సన్నిధిలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ



ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయాల్లో అభిషేకార్చన పూజలను నిర్వహించుకున్నారు. వీరిని కల్యాణమంటపంలో వేదపండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ఏఈఓ మధు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

కూటమి హయాంలో శ్రీశైలం అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



శ్రీశైలంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్న శ్రీశైల క్షేత్రం అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలోనే జరుగుతోందని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలానికి వచ్చిన ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ జ్యోతిర్లింగ శక్తిపీఠమైన శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకుని కర్నూలులో బహిరంగ సభ ఏర్పాటు చేయడం ఆంధ్ర రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. ప్రధానంగా యాత్రికుల రవాణా సౌకర్యాలు మెరుగుపరుచే దిశగా రైలు, వాయు మార్గాల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం ఎంపీ బైరెడ్డి శబరి చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అదేవిధంగా క్షేత్రానికి వస్తున్న భక్తులను ప్రత్యక్షంగా దళారులు.. పరోక్షంగా సైబర్ మోసగాళ్లు దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి తరహాలో మోసాలను అరికట్టడానికి అన్ని విధాలుగా కట్టుదిట్టం చేసే విజిలెన్స్ శాఖ ప్రత్యేక భద్రతా అధికారులు సిబ్బంది ఆవశ్యకత ఉందన్నారు. విజిలెన్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలియజేశారు. శ్రీశైల దేవస్థానంలో అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ విభాగాల్లో సుమారు 400 అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఎంపిక చేసేందుకు దేవదాయ ధర్మాదాయ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను రాజకీయం చేయకూడదని కోరారు. ప్రధానంగా జోన్ పరిధిలో ఉండే యువతకు తొలి ప్రాధాన్యతనిస్తూ అవకాశాలు కల్పించాలని సూచించారు.

ప్రగతి పథంలో సైన్స్ కీలకం

మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య



మాట్లాడుతున్న మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య

కర్నూలు కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్యకారణ సంబంధం, సత్యాన్వేషణ, హేతుబద్ధత నేర్పించే సైన్స్ సామాజిక ప్రగతిలో కీలకమని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య అన్నారు. సైంటిఫిక్ థాట్ డే, కుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సోమప్పకాలనీలోగల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేవీ కృష్ణయ్య మాట్లాడుతూ వైజ్ఞానిక స్పృహ, శాస్త్రీయ స్పృహలను సైంటిఫిక్ టెంపర్ కింద పరిగణిస్తారని అన్నారు. ప్రజలకు సైంటిఫిక్ టెంపర్ లేకపోవడం వల్లే సమస్యలు వచ్చినపుడు దొంగ బాబాలు, స్వామీజీలు, సన్యాసులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. నాగభూషణం, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీవీ వర్మ, విశ్రాంత అధ్యాపకుడు శివశంకర్ తదితరులు ప్రసంగించారు.

కర్నూలును కమ్మేసిన మంచు



జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో కర్నూలు నగరాన్ని మంచు కమ్మేస్తోంది. తెల్లవారుజామున కురుస్తున్న మంచు చూపరులను ఆకట్టుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం పల్లెసీమను తలదన్నేలా కర్నూలు నగరంపై మంచు తెర కమ్ముకుంది. పొద్దుపొద్దున్నే పక్షుల కిలకిల రావాలు.. పువ్వులపై మంచు బిందువులతో కూడిన కర్నూలు శివారు ప్రాంతం హిమగిరులను తలపిస్తోంది. కర్నూలులోని జగన్నాథగట్టుపై నుంచి తెల్లవారుజామున చూస్తే ఆహ్లాదకరమైన మంచు వాతావరణం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. ఇక పొగమంచును చీల్చుకుంటూ వస్తున్న ఉదయ భానుడి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

● కర్నూలు రూరల్, ఆంధ్రజ్యోతి

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు







విశ్రాంత ఉద్యోగి హత్య

- మద్దూరు వద్ద కుందూలో శవం
- ఆలస్యంగా వెలుగులోకి..
- డబ్బు కోసమే జరిగి ఉండొచ్చని అనుమానం

నంద్యాల టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పుల్లయ్య (60) రిటైర్డ్ ఉద్యోగిని దారుణంగా హత్య చేసిన సంఘటన నంద్యాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. నంద్యాల పట్టణం శ్యాం నగర్‌కు చెందిన పుల్లయ్య కేంద్ర ప్రభుత్వ శాఖలో పని చేస్తూ పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. ఇటీవలనే భార్యతో విడాకులు తీసుకున్నట్లు సమాచారం. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఒకరు బెంగళూరులో ఉండగా మరొకరు చెన్నైలో ఉన్నారు. అయితే బెంగళూరులో ఉన్న కుమారుడి వద్ద భార్య ఉంది. పుల్లయ్య ఇటీవల పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చిన డబ్బులతో రూ.30 లక్షలు, కొంత బ్యాంకు రుణం తీసుకుని ఇల్లు కొని తిరిగి, రూ.75 లక్షలకు విక్రయించారు. అందులో కొంత మొత్తాన్ని లోన్ కట్టారు. అయితే కొని అమ్మడంలో వైఎస్ నగర్‌కు చెందిన ఒక బ్రోకర్ (రౌడీ షీటర్) పరిచయం అయ్యాడు. అతని వద్ద నుంచి ఎలాగైనా డబ్బులు తీసుకోవాలని పన్నాగం పన్నాడు. దీంతో మిగిలిన డబ్బులకు పొలం కాని, ఇల్లు కాని కొనుక్కో అని అతన్ని నమ్మించి కారులో ఎక్కించుకుని వెళ్లాడు. తండ్రి ఎన్ని రోజులైనా ఫోన్ చేయకపోవడంతో చెన్నైలో ఉన్న కుమారుడు ఆదిత్య ప్రసాద్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడి కాల్ డేటా, సీసీ కెమెరాలతో పరిశీలించగా వారు తీసుకెళ్లిన వివరాలు అన్నీ తీసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కారులో ఎక్కించుకుని ఈనెల 14న తాడుతో గొంతుకు బిగించి చంపి మద్దూరు వద్దకు వెళ్లి మృతదేహాన్ని కుందూ నదిలో పడేసినట్లు తెలిపారు. మృతదేహం లభ్యం కాలేదు. నిందితుల్లో పాత నేరాల్లో ఉన్నవారే ఉన్నట్లు సమాచారం. పూర్తిగా ఇంకా విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఐదుగురు?

నంద్యాల పట్టణానికి చెందిన రిటైర్డు ఉద్యోగి అదృశ్యం కీలక మలుపు తిరిగింది. సదరు ఉద్యోగికి చెందిన స్థలం(ఇల్లు) విక్రయం నేపథ్యంలో తలెత్తిన ఆర్థిక లావాదేవీలతో హత్యకు గురైనట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన నలుగురు, గడివేముల మండలానికి చెందిన మరొకరు కలిసి ఈనెల 15న ఓ వాహనంలో ఉద్యోగి పుల్లయ్యను ఎత్తుకెళ్లి హత్య చేసినట్లు పోలీసుల విచారణ తేలింది. అయితే ఈనెల 19వ తేదీన బాధితుడి కుమారుడు తమ తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిపై పోలీసు రికార్డుల్లో పలు కేసులు నమోదయ్యాయి. మిగిలిన వారిపై అక్కడక్కడ ఉన్నట్లు తెలిసింది. హత్యకు పాల్పడిన వారిలో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికీ మృతదేహం ఆచూకీ పోలీసులు కనిపెట్టక పోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి రిటైర్డు ఉద్యోగి ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

వేధింపుల కేసు నమోదు

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లై మూడు సంవత్సరాలైన అదనపు కట్నం కావాలంటూ వేధించడంతో భర్త, అత్తమామ, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ గురువారం తెలిపారు. వివరాలు.. కొత్తపల్లి మండలం ఎర్రమటంకి చెందిన కొమ్ము సునీతను నందికొట్కూరు చెందిన అఖిల్‌కుమార్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. వివాహం సమయంలో సునీత తల్లిదండ్రులు కట్నకానుకలు ఇచ్చారు. అయినప్పటికీ అదనపు కట్నం కావాలంటూ ఆమెను భర్త, అత్తమామలు, ఆడపడుచుతో పాటు భర్త స్నేహితుడు కూడా వేధించేవారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

రుద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన సింధూర (27) బుధవారం అర్ధరాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మహ్మద్ రఫి గురువారం తెలిపిన వివరాలివీ.. చందలూరు గ్రామానికి చెందిన పెద్దనరసింహుడితో పాణ్యం మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన సింధూరకు ఎనిమిదేళ్లక్రితం వివాహమయింది. పెద్దమ్మాయి చందనకు ఆరోగ్యం బాగా లేదు. ఆళ్లగడ్డలో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలని భార్య కోరింది. ఆళ్లగడ్డలో జరిగే ఓ వివాహానికి కూతురు చందన, అత్త, భర్త పెద్దనరసింహుడు వెళ్లారు. హాస్పిటల్ చూపించలేదని భార్యభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. క్షణికా వేశానికి లోనై ఆత్మహత్య చేసుకుంది. సింధూర తండ్రి పెద్ద సుబ్బ నరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

జోహరాపురంలో మరొకరు..

కర్నూలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో జోహరాపురంలో జ్యోతిక (24) ఆత్మహత్య చేసుకుంది. ఈ మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త అరుణ్ కుమార్ గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలికి కూతురు ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్దుర్తి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జీన్ రైల్వేగేట్ వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ మహేష్(32) అనే యువకుడు మృతి చెందాడు. మండల పరిధిలోని మల్లెంపల్లె చెందిన మహేష్ వెల్దుర్తి పట్టణంలో నివాసముంటున్న తన తల్లి వద్దకు బైక్ మీద వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా హైవేలో కర్నూలు నుంచి బెంగుళూరు వెళ్తున్న ఐచర్ వాహనం బైక్ ఢీకొట్టింది. మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడ్ని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేష్ కోలుకోలేక మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కృష్ణవేణి, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విత్తన కంపెనీపై చర్యలు తీసుకోండి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ వరి విత్తనాలు అంటగట్టి నష్టపరిచిన లేఖన కంపెనీని సీజ్ చేయాలని, ఆ విత్తనాలు అమ్మిన కిసాన్ సీడ్స్ డీలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కలెక్టరేట్‌లోని అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయ శాఖ సూపరింటెండెంట్ పద్మజకు వినతి పత్రాన్ని అందజేశారు. కర్నూలు జిల్లాలో వివిధ కంపెనీలు ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలను అంటగడుతున్నాయని ఆరోపించారు. అక్రమాలను గుర్తించినా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చూపడం దారుణమన్నారు. ఇటీవల నందికొట్కూరు, కల్లూరు, కోడుమూరు, తదితర ప్రాంతాల్లో నకిలీ విత్తనాల వల్ల మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, అధికారుల దృష్టికి తెచ్చినా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ఐదు వారాల క్రితం నాసిరకం వరి విత్తనాల సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా, అధికారులు నిమ్మకు నీరెత్తి ఉండిపోయారని ఆరోపించారు. నిడ్జూరు మాజీ సర్పంచ్ కృష్ణ, రైతులు వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, శ్రీనివాసులు, అయ్యస్వామి, సోమశేఖర్, శేషాద్రి పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు గజ గజ..

- వణికిపోతున్న విద్యార్థులు
- అందుబాటులో లేని నైట్ వాచ్‌మన్, వార్డెన్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దుస్థితి



పగిలిపోయిన కిటికీలు



ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో దుప్పట్లు లేక చలికి వణుకుతూ పడుకున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి విజిట్

కోసిగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు గజ గజ వణికిపోతున్నారు. దుప్పట్లు లేక విద్యార్థులు చలితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లో కిటికీలు కూడా లేకపోవడంతో చల్లటి ఈదురు గాలులు విద్యార్థుల గదుల్లోకి వస్తుండటంతో చలికి వణికిపోతున్నామనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం హాస్టల్‌లో కింద పడుకునేందుకు దుప్పట్లు ప్రభుత్వం ఇచ్చిందని, కప్పుకోవడానికి దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు తెలుపుతున్నారు. కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి వరకు 146 మంది విద్యార్థులు ఉంటున్నారు. గురురారం రాత్రి 9:30 గంటలకు హాస్టల్‌ను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా.. విద్యార్థులు దుప్పట్లు చలికి వణుకుతూ దోమలతో ఇబ్బందుల పడుతూ నిద్రిస్తున్నారు. ఈ హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్, వార్డెన్ కూడా ఎవరూ లేకపోవడం గమనార్హం. హాస్టల్‌లో ఓ ప్రైవేటు వ్యక్తి మాత్రమే ఉన్నారు. అయితే విద్యార్థులకు ఏదైనా జరిగితే అడిగే నాథుడే లేడు. మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదనవ్యక్తం చేశారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్ గోపాల్‌ను వివరణ కోరగా.. తాను ఎమ్మిగనూరులో ఉన్నట్లు తెలిపాడు.

దుప్పట్లు లేవు.. చలికి వణుకుతున్నాం



హాస్టల్‌లో కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అందులో నుంచి చల్లగాలి వీస్తోంది. దుప్పట్లు లేకపోవడంతో చలికి వణుకుతూ అలాగే నిద్రపోతున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. **- ప్రవీణ్ కుమార్, 8వ తరగతి విద్యార్థి**

కిటికీలు బాగు చేయాలి



హాస్టల్‌లో కిటికీలు పగిలిపోవడంతో బయట నుంచి చల్లని గాలులు, దోమలు వస్తున్నాయి. హాస్టల్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యను వార్డెన్‌కు చెప్పాం. పరిష్కరించడం లేదు. పగిలిపోయిన కిటికీలు బాగు చేసి మాకు దుప్పట్లు ఇవ్వాలని కోరుతున్నాం.

- అజయ్, 9వ తరగతి విద్యార్థి

చెలరేగిన దొంగలు

- జిల్లాలోని పలు చోట్ల చోరీలు
- కర్నూలులో 8 తులాల బంగారం, కొలిమిగుండ్లలో బైకు, కల్లుదేవకుంట గ్రామంలో దొంగతనాలు

సినీ ఫక్కీలో చోరీ, బంగారు ఆభరణాల అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అమరావతి హోటల్ వద్ద సినిమా ఫక్కీలో రఘురామిరెడ్డి అనే వ్యక్తి కారులోంచి సుమారు 8 తులాల బంగారు ఆభరణాల చోరీ జరిగింది. వెల్దుర్తికి చెందిన రఘురామిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగల దుకాణానికి వచ్చాడు. అక్కడ 8 తులాల బంగారు ఆభరణాలు కొన్నాడు. ఆ తర్వాత గాయత్రి ఎస్టేట్ వెళ్లి అక్కడ ఆసుపత్రిలో డాక్టర్‌కు చూపించుకుని సాయంత్రం ఎస్వీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అమరావతి హోటల్ వద్దకు వచ్చాడు. అక్కడ బంగారు ఆభరణాలు కారులో ఉంచి కారుకు లాక్ చేసి లోపలికి వెళ్లి అందరూ కలిసి టిఫిన్ చేసి బయటకు వచ్చారు. తర్వాత వెల్దుర్తి వెళ్లాక రాత్రి చూసుకుంటే బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో హుటాహుటిన కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. పోలీసులు అమరావతి హోటల్ సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తే.. ఓ యువకుడు బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఆ యువకుని కోసం ఆరా తీస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు చోరీ..

కొలిమిగుండ్ల: రహదారి పక్కనే పార్కింగ్ చేసి ఉన్న బైక్ ను పట్టపగలే దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన కొలిమిగుండ్లలో జరిగింది. గ్రామానికి చెందిన కుల్లే సాయినరసింహులు లారీ హమాలీ పనికి వెళ్తూ తన బైకును గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే బైకును పార్కింగ్ చేసి తాళం వేసి వెళ్లాడు. హమాలీ పని ముగించుకొని తిరిగి వచ్చేసరికి బైకును దుండగుడు ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యం మొత్తం అక్కడే ఉన్న సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కల్లుదేవకుంటలో చోరీకి గురైన బీరువాను చూపుతున్న మహిళ

కల్లుదేవకుంటలో చోరీ..

మంత్రాలయం: మండలంలోని కల్లుదేవకుంట గ్రామానికి చెందిన తాటికాయ కురువ లక్ష్మి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం పట్టపగలే జరిగింది. మంత్రాలయం హెడ్‌కానిస్టేబుల్ అంజినేయులు తెలిపిన వివరాలివీ.. ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లగా కేటీ రామాంజినేయులు, లక్ష్మి దంపతులు పత్తి పొలానికి వెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి కూతురు వీరేశమ్మ ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలుగొట్టి తలుపులు తెరవబడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బీరువా పగలగొట్టి 15 గ్రాముల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.10 వేలు నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని వెళ్లారు. చోరీ జరిగిన విషయం మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రామాంజులు తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. గురువారం రాత్రి కావడంతో శుక్రవారం క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తామని సిఐ తెలిపారు. బాధితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

అప్రోచ్ రోడ్డును పరిశీలించిన జేసీ



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నగర పంచాయతీ బుగ్గానపల్లె గ్రామ పరిధిలో ఉన్న ఎంఐజీ లే అవుట్‌ను కర్నూలు జాయింట్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ నూరుల్ కమర్ గురువారం పరిశీలించారు. ఎంఐజీ లేఅవుట్‌లో 20 అడుగుల అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి లే అవుట్ నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు జేసీ ఈ లేఅవుట్‌ను, దాని మ్యాప్‌ను కూడా ఆయన పరిశీలించారు. తమ అనుమతి లేకుండా 20 అడుగుల అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని లేఅవుట్ లైన్ నిర్వాహకులను ఆయన హెచ్చరించారు. ఆయన వెంట బేతంచెర్ల తహసీల్దార్ నాగమణి, నగర పంచాయతీ కమిషనర్ కమిషనర్ హరిప్రసాద్, వీఆర్వో రమేష్ చౌదరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఈ-శ్రమ్' కార్డులపై అవగాహన సదస్సు



కార్డులను అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

కర్నూలు కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సూచనల మేరకు గురువారం నగరంలోని బుధవారపేటలో 'ఈ-శ్రమ్' కార్డుల నమోదు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ అసంఘటిత శ్రామికుల భద్రత, సంక్షేమం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, ప్రతి హక్కుదారుడికి చేర్చేందుకు ఈ శిబిరం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని తెలిపారు. అసంఘటిత శ్రామికులకు ఈ శ్రమ్ కార్డుల వల్ల కలిగే లాభాలను, ప్రమాద బీమా ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న, సయ్యద్ అబ్బాస్, షేక్ జకియా, బి. రామాంజినేయులు,ల డి. జేమ్స్ శేషగిరి శెట్టి, విక్రమ్‌సింగ్, కూసుపాటి బాబ్జీ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మాజీ సీజేఐ ఎన్వీ రమణ



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎన్వీ రమణ

శ్రీశైలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పీఆర్వో తాడికొండ శ్రీనివాసరావు కుమారుడు ప్రవీణ్ కుమార్ వివాహం శ్రీశైలంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఇదే వివాహానికి శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు, ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు వెంకటసుబ్బారావు, పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ తదితరులు హాజరయ్యారు.

బీఈడీలో నలుగురి డిబార్

కర్నూలు అర్బన్ , నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 3వసెమిస్టర్ పరీక్షలో ఇద్దరు, ఎంపీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు, మొత్తం నలుగురిని డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా. ఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 24 పరీక్షా కేంద్రాల్లో బీఈడీకి 3,709మంది దరఖాస్తు చేసుకోగా, 3,483 మంది హాజరయ్యారని, ఎంపీఈడీకి 104మంది దరఖాస్తు చేసుకోగా 95 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరాయిపల్లె మెట్ట వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో పుల్లమ్మ(55) అక్కడిక్కడే మృతి చెం దింది. గోపులాపురం గ్రామానికి చెందిన పుల్లమ్మ వేయించిన చెనక్కాయలను గ్రామ పరిసరాల్లో అమ్ముకొని జీవనం సాగించేది. ఈ నేపథ్యంలో పుల్లమ్మ చెనక్కాయలు అమ్ముకొని తిరిగి ఇంటి వెళ్తూ రోడ్డు దాటుతుండగా కారు అతి వేగంగా ఢీ కొంది. దీంతో పుల్లమ్మ అక్కడికక్కడే మృతి చెం దింది. అయితే కారు ఢీకొట్టి అతి వేగంగా వెళ్లిపోయింది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టు

కొలిమిగుండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో వాహనాన్ని కాల్చివేసిన ఘటనలో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఎర్రగుడి గ్రామానికి చెందిన నిమ్మకాయల శశితేజ మరో యువకుడు కలిసి ఈనెల 11న అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన పోలు సురేష్ వాహనాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ కేసులో శశితేజను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో యువకుడికి జైలుశిక్ష

చాగలమర్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఓ యువకుడికి ఆళ్లగడ్డ జేఎఫ్‌సీఎం కోర్టు 14 రోజులు జైలుశిక్ష విధించింది. ఇటీవల చాగలమర్రిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పాతబస్టాండుకు చెందిన ఏ.హుసేన్‌బాష పట్టుబడ్డాడు. పట్టుబడిన యువకుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి టి.భాస్కర్ 14 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బేతంచెర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెళుతున్న మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు సుబ్బారావు, ఏకాంబరం గాయపడ్డారు. బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మ సుబ్బారావు తన కొడుకు ఏకాంబరంతో కలిసి బైక్‌పై రామకృష్ణాపురం నుంచి బేతంచెర్లకు వస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఏపీ 40 ఈఎక్స్ 3933 అనే నెంబరు గల కారు ఢీకొట్టింది. గాయపడిన తండ్రి కొడుకులకు బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- తుంగభద్రలో దూకుతుండగా కాపాడిన పోలీసులు

మంత్రాలయం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నాటకకు చెందిన దంపతులు మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో దూకుతుండగా పోలీసులు కాపాడారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం ఉత్తర కర్నాటక హొన్నవర్ పోలీసుస్టేషన్ పరధిలోని కెరికోణ గ్రామానికి చెందిన మంజునాథ్ గణపయ్య నాయక్, వీణ మంజునాథ అనే దంపతులు రెండు రోజుల నుంచి గ్రామంలో కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు హొన్నవర్ పోలీసుస్టేషన్‌లో ఈనెల 26న అదృశ్యం కేసు నమోదు చేశారు. వారు మంత్రాలయం వచ్చారని కర్నాటక పోలీసులు మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ నది వద్దకు వెళ్లి పరిశీలిస్తుండగా దంపతులు తుంగభద్రనదిలో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడటాన్ని చూసి, కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారించగా అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోడానికి వచ్చామని చెప్పడంతో కర్నాటక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

4న దత్త జయంతి

ఆత్మకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో డిసెంబరు 4న దత్తజయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గురువారం ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈవేడుకల్లో భాగంగా డిసెంబరు 4వ తేదీ గురువారం ఉదయం 6గంటలకు కాగడా హారతి, 7.30గంటలకు సాయినాథుడికి నవవిధ అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించబడతాయని పేర్కొంది. రాత్రి 7.30గంటలకు సాయిపల్లకీ సేవ, రాత్రి 9.00 గంటలకు శేజాహారతితో పాటు మహామంగళహారతి ఉంటుందని సూచించారు. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మార్గశిర మాసం పౌర్ణమిన దత్తాత్రేయుడి జయంతోత్సవాన్ని ఆత్మకూరులో ప్రతిఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వివరించింది.

రేపు టీచర్లకు క్రీడా పోటీలు

పాములపాడు, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో గెలుపొందిన వారు డివిజన్ స్థాయిలో పాల్గొనాలన్నారు.

ఉప్పరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా సురేశ్‌కుమార్

నంద్యాల రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సగర, ఉప్పరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నంద్యాలకు చెందిన ఉప్పరి సురేశ్ కుమార్ ప్రమాణం స్వీకారం చేశారు. గురువారం విజయవాడ సెంట్రల్ గొల్లపూడి బీసీ వెల్ఫేర్ సంక్షేమ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్‌శాఖ మంత్రి సవితమ్మ, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ సమక్షంలో ఆయన ప్రమాణం స్వీకారం చేశారు. నంద్యాలకు చెందిన చిన్నయ్య, శ్రీనివాసులు, రామాంజనేయులు, మోరార్జి దేశాయ్, చిలుకల మురళి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థినికి ప్రశంసలు

పాణ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన మాక్ అసెంబ్లీలో పాణ్యం ఎమ్మెల్యేగా వ్యవహరించి ప్రతిభ కనబర్చిన పాణ్యం మోడల్ పాఠశాల విద్యార్థిని అమృత బోస్‌ను మంత్రి నారా లోకేశ్ ప్రశంసించినట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాక్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా అమృతబోస్ ప్రతిభ చాటి పతకం, ప్రశంసా పత్రం అందుకుందన్నారు. విద్యార్థినిని ఎంఈవో కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

పొలాలు తగలబెట్టొద్దు : ఏవో


రైతుతో మాట్లాడుతున్న ఏవో పవన్‌కుమార్

బండిఆత్మకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులు పంట కోత అనంతరం ఎట్టి పరిస్థితుల్లో పొలాన్ని తగులబెట్టొద్దని ఏవో పవన్‌కుమార్ సూచించారు. గురువార మండలంలోని పార్నపల్లె వద్ద తగులబడుతున్న పొలాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతుతో మాట్లాడుతూ పొలాన్ని తగులబెట్టడంతో భూమిలోని పోషకాలు నశిస్తాయని తెలిపారు.

'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి జగ్గయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటాతో పాటు 2 ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లతో పాటు దరఖాస్తు ఫారం పూర్తిచేసి వచ్చే నెల 3వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. వచ్చేనెల 7న స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఎంపిక చేస్తారని, ఎంపికైన వారికి విజయవాడలో శిక్షణ ఇస్తారని వివరించారు.

రాష్ట్రస్థాయి స్పైడ మార్షల్ పోటీల్లో పతకాలు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి స్పైడ మార్షల్ చాంపియన్‌షిప్ పోటీల్లో చాపిరేవులలోని మార్నింగ్ స్టార్ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ జాన్సి జోసఫ్, కరస్పాండెంట్ సిస్టర్ నీటు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో వివిధ అంశాల్లో అత్యంత ప్రతిభ కనబరచి పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులను, కరాటే మాస్టర్ నూర్ బాషను ప్రత్యేకంగా అభినందించారు.

మెడిసిన్‌లో దీబగుంట్ల వాసికి గోల్డ్‌మెడల్


నాగశిశింద్రారెడ్డి

గోస్పాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీబగుంట్ల గ్రామానికి చెందిన రేపల్లె నాగశిశింద్రారెడ్డి వైద్య విద్య పీజీ జనరల్ మెడిసిన్‌లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించి గోల్డ్‌మెడల్ పొందాడు. గ్రామానికి చెందిన రేపల్లె చిన్న నాగసుబ్బారెడ్డి కుమారుడు నాగశిశింద్రారెడ్డి స్కూల్ విద్యనుంచి చదువులో ముందుండేవాడు. ఎంబీబీఎస్ తిరుపతి రుయా కళాశాలలో పూర్తిచేసి పీజీ జనరల్ మెడిసిన్ కడప ప్రభుత్వ కాలేజీలో పూర్తిచేశాడు. డా. ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి పీజీ జనరల్ మెడిసిన్‌లో మొదటి ర్యాంక్ సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచాడు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన నాగశిశింద్రారెడ్డి స్టేట్‌ర్యాంక్ సాధించడంపై దీబగుంట్ల గ్రామానికి చెందిన చిట్టెపు ప్రభాకర్‌రెడ్డి, ఒంటెద్దు శివరామిరెడ్డి, ఉమా మహేశ్వరరావు, చిట్టెపు శివరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గోపవరం మెట్ట వద్ద బుధవారం రాత్రి ఓకారు బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన చుట్ల కుమార్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలోని తనఇంటి నుంచి నంద్యాలకు బైక్‌పై బయలుదేరిన కుమార్‌ను గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న కారు గోపవరం మెట్ట వద్ద వేగంగా వచ్చి మోటర్ బైక్‌ను ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డకుమార్‌ను చికిత్సకై కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మంత్రి బీసీకి ధన్యవాదాలు

కోవెలకుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల ప్రజల కోరిక తీర్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఉమ్మడి కర్నూలు మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబరు ఎస్ఏ గఫూర్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో ఉన్న కోవెలకుంట్ల మండలాన్ని వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లాల విభజన అనంతరం కోవెలకుంట్ల మండలాన్ని డోన్ రెవెన్యూ డివిజన్‌లో కలిపింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు డోన్‌కు వెళ్లాలంటే బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి బీసీ మంత్రి కావడంతో ప్రజల తరపున తాను మంత్రికి వినతిపత్రం ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


కొత్తపల్లి : 'రైతన్న మీకోసం'లో పాల్గొన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, అధికారులు, నాయకులు

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగించుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. గురువారం మండలంలోని కొక్కెరంచలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని రైతుల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వపథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, ఏవో అమీరున్నిసాబేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, పీఆర్ ఏఈ మద్దిలేటి, ఎంఈవో నాగరాజు, టీడీపీ మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, చంద్రశేఖరరెడ్డి, వెంకటరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కూటమితోనే రైతులకు మేలు

బండిఆత్మకూరు: కూటమి ప్రభుత్వంతోనే రైతులకు మేలు చేకూరుతుందని ఆత్మకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బండిఆత్మకూరు, ఎర్రగుంట్ల, కాకనూరు, పార్నపల్లె, పరమటూరు గ్రామాల్లో ఏవో పవన్‌కుమార్ నేతృత్వంలో 'రైతన్న మీ కోసం' ఇంటింటా నిర్వహించారు.డాక్టర్ అనూష, సూపరింటెండెంట్ శ్యామల, టీడీపీ నాయకులు మధురెడ్డి, నాగేశ్వరరావు, జాకీర్, అంజాద్, నాగేశ్వరరెడ్డి, మధురెడ్డి, వై జగన్మోహన్ రెడ్డి, రఘుస్వామిరెడ్డి పాల్గొన్నారు.


రైతులతో మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి

ప్రత్యేక వ్యవసాయంతో అధిక దిగుబడులు

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికాభివృద్ధి చెందొచ్చని ప్రాంతీయ పరిశోధనా సంస శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, మల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఏడీఏ హేమలతతో కలసి మండలంలోని ముష్టపల్లి సిద్దపల్లి, కరివేన గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులతో వారు మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు, తెగుళ్ళ మందుల వాడకం తగ్గించాలన్నారు. జీవఎరువుల వాడకంతో భూసారం, దిగుబడులు పెరుగుతాయన్నారు. వారి వెంట ఎంపీఈవోలు ఉన్నారు.


కరివేనలో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త

సక్రమంగా సర్వే చేయాలి : డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వరకు జరగనున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లాలోని శ్రీశైలం, భైర్లూటి, బండిఆత్మకూరు పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే జరిగిన విధానాన్ని అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత డిఫార్మిటీ కేసులకు అవసరమైన సేవలు, పింఛన్లు సకాలంలో అందేలా చూడాలన్నారు. కేంద్రబృందం సభ్యులు శాంతారాం, రీతితివారి, మనూషిశర్మ, దేవసాగర్, డీఎంఎంవో తేజస్విని, డీపీఎంవో వెంకటరమణ పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

- మధ్యాహ్న భోజనం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం(కేజీబీవీ) సిబ్బందిపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఐదు రోజులుగా రికార్డులలో ఎలాంటి వివరాలు నమోదు చేయకపోవడంతో ఆగ్రహించారు. విద్యార్థినుల హాజరుపట్టిని పరిశీలించగా.. 234మంది విద్యార్థినులకు గాను కేవలం 183మంది మాత్రమే హాజరు కావడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు అందించే నిత్యావసర సరుకులను పరిశీలించగా.. ముక్కిపోయిన పల్లీలతో పాటు కొన్ని నిత్యావసర సరుకులు కూడా లేకపోవడంతో విద్యార్థులకు భోజనం ఎలా తయారుచేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించగా సిబ్బంది నుంచి మౌనమే సమాధానమైంది. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ ఉదయం అందించే టిఫిన్‌తో పాటు చికెన్ కర్రీ కూడా సరిపడ పెట్టడం లేదని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల ప్రత్యేక అధికారి(ఎస్‌వో) నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆమెకు మెమో జారీ చేసేందుకు నంద్యాల జీసీడీవోకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తొలగిన కూరగాయల వ్యాపారుల కష్టాలు

- నాబార్డు ఏజీఎం కార్తీక్
- పారుమంచాలలో కూరగాయల మార్కెట్‌కు భూమిపూజ


మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు ఏజీఎం కార్తీక్

జూపాడుబంగ్లా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల గ్రామంలో కూరగాయల వ్యాపారుల కష్టాలు తొలగినట్లు అని నాబార్డు ఏజీఎం కార్తీక్ అన్నారు. గురువారం నాబార్డు మంజూరుచేసిన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ఏజీఎం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో వర్షాకాలంలో మరి ఎండాకాలంలో ఇబ్బందితో రోడ్లపై కూరగాయలు అమ్ముకునేవారు ఇకపై ఇబ్బందులు పడకుండా మార్కెట్ నిర్వహించుకోవచ్చునని ఆయన అన్నారు. మార్కెట్ నిర్మాణం కోసం పాటుపడిన స్థానిక స్వచ్ఛంద సంస్థ పరమేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ, సర్పంచు ప్రకాశం ఎంతో కృషి చేశారని ఆయన తెలిపారు. మార్కెట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, గ్రామపెద్దలు వెంటరామిరెడ్డి, చెంచురెడ్డి, దేవసహాయం, రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.


పూజలందుకున్న దత్తాత్రేయుడు


నృత్య ప్రదర్శనలో కళాకారులు

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిర్వహించే వార పూజల్లో భాగంగా త్రిఫల వృక్షం క్రింద కొలువైఉన్న దత్తాత్రేయ స్వామికి గురువారం ఉదయం పంచామృతాభిషేకాలు, విశేషార్చనలు, పూజలు చేశారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపంలో దత్తాత్రేయునిగా అవతరించారని ఆలయస్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు తెలిపారు. సాయంత్రం నందికొట్కూరుకు సాయినాట్య కళాశాల బృందంచే భక్తిగీతాలకు లక్ష్మి, తులసి, ధనశ్రీ, హన్షిక, సర్వజ్ఞలు చేసిన కూచిపూడి నృత్యాలు యాత్రికులను అలరించాయి.

అన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి గురువారం కడపకు చెందిన రమేష్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారికి అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదాలు, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.


ఆలయ అధికారులకు విరాళం ఇస్తున్న దాతలు

ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందిస్తాం

- కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో రామునాయక్

నంద్యాల, నూనెపల్లి 27 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందిస్తామని కలెక్టర్ రాజకుమారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌యాదవ్‌కు వివరించారు. విజయవాడలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, డీఆర్వో రామునాయక్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించిన ఏ దరఖాస్తులూ పెండింగ్‌లో లేవన్నారు. బూత్ స్థాయి అధికారుల రేషనలైజేషన్ ప్రతిపాదనలు ఇప్పటికే పంపించినట్లు, వాటికి సంబంధించిన బీఎల్‌వో వివరాలన్నీ సమర్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి బీఎల్‌వో ఖాళీలూ లేవని, ఎన్నికల ఖర్చుల నివేదికను కూడా సీఈవో కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. రేషనలైజేషన్ అనంతరం ఏర్పాటైన కొత్త పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బీఎల్‌వోల జాబితాను కూడా పబ్లిష్ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో స్వచ్ఛమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నంబరుపై అధిక సంఖ్యలో ఓట్లు, ఒకేవ్యక్తి పేరుతో అధికఓట్లు వంటి లోపాలను తొలగించాలని ఆదేశించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో వార్డెన్లు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రైతుల నుంచి ధాన్యం సేకరణ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సిటిజన్ సర్వే, సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్యం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాలికల, బాలుర వసతిగృహాలు, బీసీ హాస్టల్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు ఎదుర్కొంటున్నారని వార్డెన్లు దృష్టి సారించాలన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్

నంద్యాల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధంకావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కార్యకర్తలతో జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కొత్తరకం విధానాలను అనుసరిస్తుందని ఆరోపించారు. కార్మికులను బానిసలుగా మార్చుకోవాలనే ఉద్దేశంతో 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదింపు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేకంగా కార్మిక, ఉద్యోగులను సమీకరించి ఉద్యమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యేసురత్నం, నాగరాజులతో పాటు నరసింహనాయక్, రామచంద్రుడు, లక్ష్మణ్, శోభారాణి, నాగమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.సుబ్బమ్మ, సోహైల్‌బాషను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా గురువారం ఆ పాఠశాల హెచ్‌ఎం రాములునాయక్ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25న రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే అండర్ 14 విభాగంలో 24 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి సుబ్బమ్మ జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. సోహైల్‌బాష 20 కిలోల విభాగం కాంస్య పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మునిశేఖర్, తిమ్మరుసు, మునీంద్ర, పవన్, విద్యార్థిని తల్లి సుజాత పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాల విద్యార్థి గురునితిన్‌రాయల్ అనే విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. గత నెల 31న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడన్నారు. ఎంపికైన విద్యార్థి ఈనెల 28నుంచి 30వరకు చిత్తూరుజిల్లా కలికిరిలో నిర్వహించే 69వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు శశికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధి కోసమే గ్రామసభలు


గోపవరంలో మాట్లాడుతున్న తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్

మహానంది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, తద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్ తెలిపారు. గురువారం మహానంది మండలం గోపవరం గ్రామంలో సర్పంచ్ వంకె సుదర్శనం అధ్యక్షతన అధికారులు గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామంలోని కొన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు అంతా రహదారిపై ప్రవహించడంతో దుర్వాసన వస్తుందని ఈసమస్యను వెంటనే అధికారులు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందని, వాటిని సక్రమంగా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలా, పంచాయతీ కార్యదర్శి సుహాసిని నీటిసంఘం అధ్యక్షుడు కశెట్టి శ్రీను, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగ ఉపకరణాల నిర్ధారణ శిబిరం

పాణ్యం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 18 యేళ్లలోపు మానసిక, శారీరక, సెరిబ్రల్ పాలసీ, బహుళ వైకల్యం గల పిల్లలకు శనివారం ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్షా జిల్లా విద్యాశాఖ, అలింకో ఆధ్వర్యంలో నంద్యాల ఎస్పీజీ హైస్కూలు వద్ద శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినికిడి లోపం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి అవసరమైన సహాయ ఉపకరణాలను (వీల్ చైర్, ట్రైసైకిల్, కాలిపర్స్, చేతికర్రలు, రోలేటర్స్, వినికిడి యంత్రాలు, మానసిక బోధనా సామగ్రి ఉచితంగా అందజేస్తారన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ఉదయం 10గంటలకు శిబిరం వద్దకు తీసుకువెళ్లాలన్నారు. ఆధార్, యూనిక్ డిజబులిటీ గుర్తింపు కార్డు, మూడు ఫొటోలు తెచ్చుకోవాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నందికొట్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగముని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంను ఎటువంటి ఫీజు లేకుండా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రు. ఈ శిక్షణ సైబర్ సెక్యూరిటీ, ఆటోమోటివ్ స్పెషలిస్టుల్లో అనుభవం కలిగిన వారిచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు. డిగ్రీతో సమానం పాస్, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన అభ్యర్థులు శిక్షణలో చేరవచ్చునని ప్రిన్సిపాల్ కోరారు. ఆసక్తిగల వారు తమ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు తీసుకుని స్కిల్ హబ్‌లో సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని, మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9154830286లో సంప్రదించాలని ఆయన కోరారు.

బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై హర్షం


సీఎం చంద్రబాబు, మంత్రి బీసీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండులో గ్రామ టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృషి ఎనలేనిదని అన్నారు. కార్యక్రమంలో గూలి నాగేశ్వరరెడ్డి, ఉలువల నరసింహుడు, గూడూరు మహేశ్వరరెడ్డి, భూపాల్‌రెడ్డి, చంద్ర, నాగార్జున రెడ్డి, బీజేపీ రామసుబ్బయ్య, వెంకటేషు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి ధన్యవాదాలు

కోవెలకుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల ప్రజల కోరిక తీర్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఉమ్మడి కర్నూలు మాజీ జడ్పీ కోఆప్షన్ మెంబరు ఎస్ఏ గఫూర్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో ఉన్న కోవెలకుంట్ల మండలాన్ని వైఎస్ఆర్ పార్టీ అధికారంలోకి వచ్చాక జిల్లాల విభజన అనంతరం కోవెలకుంట్ల మండలాన్ని డోన్ రెవెన్యూ డివిజన్‌లో కలిపింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు డోన్‌కు వెళ్లాలంటే బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి బీసీ జనార్ధనరెడ్డి మంత్రి కావడంతో ప్రజల తరపున తాను మంత్రికి వినతిపత్రం ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారన్నారు. మంత్రి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సీఎం చంద్రబాబుతో మాట్లాడి ప్రాంత ప్రజల సమస్యలు వివరించి బనగానపల్లెను రెవెన్యూ డివిజనుగా ఏర్పాటు చేయించారు.

మెసేజ్ చేస్తే సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

డోన్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గ ప్రజలు తమ పరిధిలోని ఏమైనా సమస్యలు ఉంటే సోషల్ మీడియా ద్వారా మెసేజ్ చేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం వాట్సాప్ ద్వారా అందిన పారిశుధ్య సమస్య ఫిర్యాదును ఎమ్మెల్యే కోట్ల వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి ఇటువంటి విషయాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పారిశుధ్య సమస్యలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

బేతంచెర్లలో నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

డోన్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజల నుంచి ఫిర్యాదుల (గ్రీవెన్స్) స్వీకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు టీడీపీ నాయకులు గురు వారం తెలిపారు. ఈకార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. బేతంచెర్ల మండలం, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం రాత్రి మండ లంలోని సౌదరదిన్నె గ్రామంలో పల్లెనిద్ర నిర్వహించారు. గ్రామంలోని రైతులందరినీ సమావేశపరిచి సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఓబీసీ జన గణన చేపట్టాలి

డోన్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓబీసీ జనగణనను ప్రభుత్వం చేపట్టాలని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి ఐక్యవేదిక సంఘం నాయకులు పట్నం రాజేశ్వరి, నంది విజయలక్ష్మి, జాకీర్ హుశేన్, గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం డోన్‌లోని వడ్డెర సం క్షేమ సంఘం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 14న కర్నూలు జిల్లా పరిషత్ హాలులో జరగనున్న ఓబీసీ సభలో ఓబీసీలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు విస్తృతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఓబులేసు భూమన నాగన్న, ఆకుతోట, పద్మావతి, షేకూన్‌బీ, లక్ష్మేశ్వరి పాల్గొన్నారు.

295 అనుమానిత కేసులు

చాగలమర్రి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 295 కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న అనుమానిత కేసులు నమోదైనట్లు సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని 12వ వార్డులో జరుగుతున్న కుష్ఠువ్యాధి లక్షణాల గుర్తింపు సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెరిఫికేషన్‌కు హాజరు కావాలి

డోన్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజోతి): నంద్యాలలోని ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి కోరారు. వచ్చే నెల 4న కర్నూలు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాల ఐసీటీసీ కౌన్సిలర్ విజయలక్ష్మి ఎయిడ్స్ వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, నివారణోపాయాలను గురించి వివరించారు. అనంతరం హ్యాండ్స్ సంస్థ సభ్యులు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్ర మంలో అధ్యాపకులు ఆనందరావు, కిశోర్‌కుమార్, మురళీమో హన్, శ్రీలత, హ్యాండ్స్ సంస్థ సభ్యులు ఆఫ్రిన్, హసీనా, సరస్వతి పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై..

రుద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆదర్శ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ముత్తలూరు యూనియన్ బ్యాంకును విద్యార్థులతో కలిసి ఆయన సందర్శించారు. ఆన్‌లైన్ లావాదేవీలు, ఆర్‌టీజీఎస్ఎస్, ఐఎంపీఎస్, ఏటీయం అండ్ సీడీఎస్ సిస్టం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేగేటు పాట్లు

- అరగంటకోసారి గేటు పడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఫ్లైఓవర్ నిర్మించాలంటున్న స్థానికులు

బేతంచెర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కర్నూలు-బనగానపల్లె ప్రధాన రహదారిలో ఉన్న రైల్వేగేటు రైళ్ల రాపోకలతో అరగంటకోసారి పడుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సింగిల్ రైల్వేట్రాక్ ఉండటం వల్ల వివిధ రైలు, గూడ్స్ రైలు వెళ్లే సమయంలో మాత్రమే రైల్వేగేటు పడుతుండటంతో ఎలాంటి ఇబ్బంది లేక పోయిందని పలువురు తెలిపారు. ప్రస్తుతం రైల్వేట్రాక్ డబుల్ కావడంతో అరగంటకోసారి గూడ్స్ రైళ్ల రాకపోకలు కొనసాగుతు న్నాయి. ఈ రైల్వేగేటు మీదుగా బనగానపల్లె వైపు వెళ్లే బస్సులు వాహ నాలతో కర్నూలు వెళ్లే బస్సులు వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి రైల్వేగేటు పడటంతో కర్నూలుకు ఇటు బనగానపల్లెకు వెళ్లే బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నూలు, బనగానపల్లె వైపు నుంచి బస్సుల తోపాటు లారీలు, ట్రాక్టర్లు బేతంచెర్లకు వస్తుండటంతో గూడ్స్ రైళ్ల రాకపోకలతో గంటల తరబడి గేట్ల వద్ద వాహనదారులు, ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఫ్లైఓవర్ నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రైల్వేగేటు పడటంతో నిలిచిపోయిన వాహనాలు

మినుము రైతు కుదేలు


మద్దూరులో మినుము పంటను దున్నేస్తున్న రైతు

అధిక వర్షాలతో మినుము పంట దెబ్బతిని రైతులు కుదేలయ్యారు. మండలంలోని మద్దూరు గ్రామంలో నాగేశ్వరరావు అనే రైతు సాగు చేసిన నాలుగు ఎకరాల మినుము పంట దెబ్బతింది. ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు గురువారం ట్రాక్టర్‌తో పంటను దున్నేశారు. మూడు నెలల పాటు పంటను కాపా డుకుంటూ వచ్చామని, పంట దిగుబడి సమయంలో అధిక వర్షాలు కురవడంతో పంట దెబ్బతిని భారీగా నష్టపోయామన్నారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుయాదవ్ మాట్లాడతూ రైతులు ఆనందంగా ఉం డాలనే ప్రభుత్వ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి నిధులను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. కార్యక్రమంలో సందీప్, దామోదర్, ఆదినారాయణ, రామక్రిష్ణ, సుంకన్న, సరేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

చాగలమర్రి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏవో రంగనేతాజీ అన్నారు. గురువారం మండలంలోని నేలంపాడు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: కొత్త వంగడాలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి ప్రమీల, వ్యవసాయ సంచాలకుడు సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని గుండుపాపల, డబ్యూ.గోవిందిన్నె, కొత్తపల్లె గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో మణికంఠ, ఆయా గ్రామాల టీమ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


చంద్రపల్లిలో 'రైతన్న మీ కోసం'లో పాల్గొన్న నాగేశ్వరరావు యాదవ్

సంజామల: అధిక వర్షాలతో శనగ పంటకు సోకే ఎండు తెగుళ్లను నివారించాలని మండల వ్యవసాయ అధికారి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. గురు వారం మండలంలోని కానాల గ్రామంలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్ర మంలో జలవనరుల కేంద్రం ఏడీఏ చెన్నయ్య ఏవో వెంకటేశ్వర రెడ్డితో కలిసి శనగ పంట సాగు చేస్తున్న రైతులకు కొత్త వంగడాలను సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

ఆళ్లగడ్డ, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి జనార్దన్ రెడ్డి అన్నారు. ఆహోబిలంలో జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్ పోటీలను డీఈవో గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మూడు శాతం కోటాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి, టోర్నమెంట్ ఆర్గనైజర్ నాగేంద్ర, ఏపి బేస్‌బాల్ అసోసియేషన్ సీఈవో మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుసేనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2005-06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. బెంగళూరు, హైదా రాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 60 మంది పూర్వపు విద్యార్థులు ఈ సమావేశానికి హాజరై అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ మధుర క్షణం తీపిగుర్తుగా స్నేహి తులు సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు


క్రీడలపై ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈవో

సంజామల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు, పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబరు 2వ తేదీ నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు వెంకట రమణారెడ్డి, ఈశ్వరయ్య గురు వారం తెలిపారు. మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా సమన్వయకర్త బాషా, వ్యాయామ సంచాలకులు చిన్న మౌలాలి, నాగలక్ష్మీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ క్రీడలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 16మంది పురుషులు, 12మంది మహిళలను డివిజన్ స్థాయి జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా మేధా విద్యాసంస్థల అధినేత చిన్నంశెట్టి నరసింహులు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ నాగేంద్ర మాట్లాడుతూ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో ఏపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఆశాజ్యోతి, వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరు కొత్తపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సోమశేఖరరెడ్డి గురువారం తెలిపారు. హ్యాండ్‌బాల్‌లో యశశ్విని, కర్నూలు జట్టుకు ఎంపికై తిరుపతి జిల్లా కనిగిరిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే సమీరాభాను హాకీ విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికై నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని హెచ్ ఎంతోపాటు ఫిజికల్ డైరక్టర్ శేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

పంట సాగులో రైతులు నిమగ్నం


రుద్రవరం సమీపంలో మొక్కజొన్న నాటుతున్న కూలీలు

రుద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ సీజన్ పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న సుమారు పదివేల ఎకరాల్లో, వేరుశనగ 500 ఎకరాల్లో, మినుము 2 వేల ఎకరాల్లో రైతులు ఇప్పటికే సాగు చేశారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న, వరి, మినుము నష్టాలురావడంతో రబీలో అయినా ఆ నష్టాలు భర్తీ చేసుకోవడానికి సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు.

దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం తోడ్పాటు

సమగ్రశిక్ష జిల్లా విలీన విద్య సమన్వయకర్త జగన్ మోహన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని సమగ్రశిక్ష జిల్లా విలీన విద్య సమన్వయకర్త జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లెలో ఎంఈవో స్వరూప ఆధ్వర్యంలో అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, బనగానపల్లె, కోవెలకుంట్ల మండలాల్లోని దివ్యాంగ పిల్లలకు అలింకో డాక్టర్లు కుమారి ప్రియవర్మ, తివారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గత నెల రోజుల నుంచి ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఫిజియో థెరపీస్టులు గత నెల రోజులనుంచి సర్వే నిర్వహించి దివ్యాంగ చిన్నారులను బనగానపల్లె వైద్య శిబిరానికి తీసుకువ చ్చినట్లు తెలిపారు. వీరికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. జిల్లా ప్రత్యామ్నాయ సమన్వయకర్త ఎండీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వైకల్యం విద్యకు అడ్డురాకూడదన్నారు. మండల విద్యాధికారి స్వరూప మాట్లాడుతూ పిల్లలకు వైకల్యం శాపం కారాదన్నారు. కార్యక్రమంలో జిల్లా విలీన విద్య సహాయ సమన్వయకర్త మండ్ల శ్రీనివాసులు, అవుకు, బనగానపల్లె ఎంఈవోలు శ్రీధర్, శ్రీనివాసులు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


దివ్యాంగ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

బాల్య వివాహాలు చేస్తే చర్యలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్ర

చాగలమర్రి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్ర హెచ్చరించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాల గురించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేంద్ర ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శారీరక, మానసిక ఆరోగ్య విపత్తుల గురించి వివరించారు. హెచ్ఎం జీవయ్య, ఏఎన్ఎం గార్లెట్, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం

డోన్ రూరల్, నవంబరు 27(ఆంధ్రజోతి): మండలంలోని ఎద్దుపెంట గ్రామ సచివాలయంలో ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పులిశేఖర్ కార్యాలయానికి తాళం వేశారు. గురువారం ఎద్దుపెంట సచివాలయాన్ని ఆయన సందర్శిం చారు. సచివాలయంలో ఒక ఉద్యోగి కూడా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎద్దుపెంట గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయని, సచివాలయంలో పని నిమిత్తం వచ్చే వారి పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈవిషయంపై ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డిని వివరణ కోరగా.. విధుల్లో భాగంగా సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లోకి వెళ్తున్నా రన్నారు. ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం, హౌసింగ్ సర్వేల కోసం ఉద్యోగులు ఇంటింటికి తిరుగుతున్నారని వివరించారు.


సచివాలయానికి తాళం వేస్తున్న సీపీఐ నాయకుడు పులిశేఖర్

అరటి ధరలపై ఆందోళన వద్దు

ప్యాపిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అరటి ధరలపై ఆందోళన వద్దని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గుడిపాడు గ్రామంలో అరటి సాగులో తీసుకోవలసిన జాగ్రతలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు

ఉయ్యాలవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో దత్తాత్రేయస్వామి అర్చకుడు ఆచారి పూజలు చేశారు. గురువారం దత్తాత్రేయస్వామి ప్రతిష్ఠ సందర్భంగా గ్రామస్థులంతా కలిసి స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పలకల పంపిణీ

ఉయ్యాలవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత పల్లె నరసింహరెడ్డి పలకలు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. గురువారం పాఠశాల హెచ్ఎం లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు అందించారు.

మట్కా బీటర్ అరెస్టు

ప్యాపిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మట్కా బీటర్ బషీర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ గురువారం తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.వెయ్యి నగదుతో పాటు 15లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్ఐ తెలిపారు.

ముస్లింలు రాజకీయంగా ఎదగాలి


మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముస్లింలు రాజకీయంగా ఎదగాలని ముస్లిం ఐక్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం సుబహాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆళ్లగడ్డ షాదీఖానాలో జేఏసీ కన్వీనర్ బీరువాల బాషా ఆధ్వర్యంలో ముస్లిం సంఘాల నాయకులు, మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు ఒకటిన అయ్యలూరు మెట్ట నుంచి నంద్యాల గాంధీ సర్కిల్, అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ముస్లిం రాజకీయ చైతన్య యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గం నుంచి భారీగా ముస్లింలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బాషా, ఎస్‌డీపీఐ నాయకులు ఖాజావలి, ఫకృద్దీన్, బాజాన్, నూర్‌బాషా, ఖలీల్, హుసేన్ బాషా, జమాల్‌వలి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈగా శ్రీనివాసులు

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ విద్యుత్ శాఖ డీఈఈగా శ్రీనివాసులు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఆరు మండలాల పరిధిలో విద్యుత్ శాఖకు సంబంధించిన ఏ సమస్య ఉన్న పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూక నరసింహారెడ్డితో పాటు విద్యుత్ శాఖాధికారులు నూతన డీఈఈకి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎన్‌సీసీ యూనిట్‌కు విద్యార్థుల ఎంపిక

ఆళ్లగడ్డ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో చైర్మన్ హేమలతారెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో 28(ఏ)ఎన్‌సీసీ కర్నూలు బెటాలియన్‌కు గురువారం ఫస్టియర్ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ అశోక్ కుమార్, హవల్దార్ పింజు శర్మా కళాశాలలో 109 మంది విద్యార్థులకు శారీరక దృఢత్వం, గ్రౌండ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 31 మందిని 28(ఏ) ఎన్‌సీసీ యూనిట్ అభ్యర్థులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీటీవో నాగేంద్ర, రఫి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత

చాగలమర్రి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యతగా తీసుకోవాలని ఈవో తారకేశ్వరి అన్నారు. గురువారం చాగలమర్రి మేజర్ పంచాయతీ కార్యాలయంలో పోలీసు బందోబస్తు మధ్య సర్పంచ్ తులశమ్మ అధ్యక్షతన వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామంలోని పలు సమస్యలపై సభ్యులతో చర్చించారు. గ్రామంలో పారిశుధ్యం, నీటి సమస్య, వీధిలైట్లు, పలు అంశాల గురించి సమీక్షించారు. పంచాయతీ నిధులతో గ్రామాభివృద్ధి చేయాలని 18వ వార్డు సభ్యుడు మౌలాలి కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోహెల్, పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఏవో

కోవెలకుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న వాతావరణ మార్పులతో తుఫాను ఏర్పడి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆది, సోమవారాల్లో నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారన్నారు. మొక్కజొన్న, వరి పంటలను కోయాలనుకునే రైతులు పంట కోయకుండా వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పంట కోసిన వారు ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.